## 'ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి'



కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి అప్పారావు

పెన్‌పహాడ్, మే 2: ధాన్యం కొనగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వి.వి.అప్పారావు అన్నారు. మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత లేకుండా చూడాలని, వాతావరణంలో మార్పులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు. రైతులు తేమ శాతం తగినంత ఉండేలా చూసుకొని నిర్వాహకులకు సహకరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీని పరిశీలించి తాటి, ఈత మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏపీఓ రవి, ఏపీఎం అజయ్‌నాయక్, ఏఓ అనిల్‌నాయక్, ఈసీ మహేశ్, సీసీలు ఆశ, స్వరూప, లత, ఐకేపి సిబ్బంది పద్మావతి, లత, సరోజ, రజని పాల్గొన్నారు.

## కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలి

- డీఐఈఓ భానునాయక్



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న డీఈఐఓ భానునాయక్

ఆత్మకూర్.ఎస్, మే 2: మండలంలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ భానునాయక్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫలితాలపై అధ్యాపకులతో సమీక్షించారు. గతేడాది కంటే ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందించారు. అనంతరం కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఐఈఓ భానునాయక్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. ప్రతి అధ్యాపకుడు అడ్మిషన్ డ్రైవ్‌లో పాల్గొని రాబోయే విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా చూడాలని అన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని వివరించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య, అధ్యాపకులు గునగంటి వెంకటేశ్వర్లు, దశరథ, డాక్టర్ అమల, లింగయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 'చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు'



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న తాసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్

మునగాల, మే 2: చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తాసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ శానిటేషన్(వీహెచ్‌ఎస్), న్యూట్రిషన్ డే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదలకు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బెజవాడ సరిత, ఖాజా మొహినుద్దీన్, సంధ్యారాణి, రేష్మ, వనజ తదితరులు పాల్గొన్నారు.

## 'క్రీడల శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి'




శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు వెంకట్రామనర్సమ్మ

తుంగతుర్తి, మే 2: మండల పరిధిలోని వెంపటి గ్రామంలో వెంపటి స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామనర్సమ్మ అన్నారు. శుక్రవారం వెంపటి గ్రామంలో కబడ్డీ క్రీడాకారుడు, శిక్షణ శిబిరం డైరెక్టర్ చిటిపాక మహేశ్‌తో కలిసి ఆమె శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం డైరెక్టర్ మహేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ క్రీడలలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పిల్లలను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి గ్రామస్తుల సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బుచ్చయ్య కుటుంబానికి సాయం అందజేస్తున్న స్నేహితులు

ఆత్మకూర్.ఎస్, మే 2: మండల పరిధిలోని కందగట్ల గ్రామానికి చెందిన ఎల్లబోయిన బుచ్చయ్య, రమాదేవి దంపతుల కుమారులు హరీశ్, సాయిధనుష్ వెన్నెముక సంబంధిత వ్యాధితో ఇబ్బందుల పడుతున్నారు. వారి చికిత్స నిమిత్తం బుచ్చయ్యతో పాటు కందగట్ల పాఠశాలలో పదో తరగతి చదివిన స్నేహితులు చేయూత అందించారు. రూ. 56,500 సేకరించి శుక్రవారం బుచ్చయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నేరెళ్ల దేవరాజు, బోనగిరి వీరమ్మ, కొడిదల ఆంజనేయులు, అరూరి యాకస్వామి, గద్దపాటి వీరస్వామి, తండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి'



వల్లపురంలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నడిగూడెం, మే 2: ప్రతి రైతు తమ పంట పొలాల్లో సేంద్రియ కర్బన శాతం ఎంత ఉందో తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేయించుకోవాలని సిరి ఫౌండేషన్ చైర్మన్, వ్యవసాయ సామాజిక కార్యకర్త మొలుగూరి గోపి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో భూసార పరీక్షలపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కోరారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకంతో అనేక వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# 5 నుంచి రెవెన్యూ సదస్సులు

- జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా గరిడేపల్లి మండలం
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మే 2: భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5వ తేదీ నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఇందుకోసం పైలట్ ప్రాజెక్ట్‌గా గరిడేపల్లి మండలాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. గరిడేపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులు, భూ భారతి చట్టంపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామంలో జరిగే సదస్సు రోజే ఆ రెవెన్యూ గ్రామానికి చెందిన ఆవాస గ్రామాల రైతులు హాజరు కావాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ రాంబాబు, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీఓలు శ్రీనివాసులు, వేణుమాధవరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ ధర్మారెడ్డి, వివిధ మండలాల తాసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎప్‌సెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 2: జిల్లా కేంద్రం సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎప్‌సెట్ పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ నరసింహ శుక్రవారం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహణలో పోలీస్ సిబ్బంది పనితీరును అభినందించి వారికి పలు సూచనలు చేశారు.

## గాలి దుమారం మిగిల్చిన నష్టం

- ఇండ్లపై కూలిన చెట్లు.. విరిగిన రేకులు



రెడ్లకుంటలో ఓ ఇంటి సిమెంట్ రేకులు పగిలిన దృశ్యం



చిమిర్యాలలో ఇంటిపై కూలిన చెట్టు

కోదాడ రూరల్, మే 2: మండల పరిధిలోని రెడ్లకుంట, చిమిర్యాల, తొగర్రాయితో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన గాలి దుమారానికి పలువురి ఇండ్లపై రేకులు ఎగిరిపోవడంతో పాటు చెట్లు విరిగిపడ్డాయి. అదేవిధంగా కొన్ని గ్రామాల్లో ప్రహరీలు కూలాయి. రెడ్లకుంటలో దిలీప్, పిడమర్తి పెద్ద సైదులు అనే వ్యక్తుల ఇండ్ల రేకులు గాలి దుమారానికి ఎగిరిపోగా చిమిర్యాల గ్రామంలో కలకొండ పద్మ అనే మహిళ ఇంటి ముందు ఉన్న వేపచెట్టు కూలి రేకులు విరిగాయి.

## ఈతకు వెళ్లి బాలుడు మృతి

చింతలపాలెం, మే 2: ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని పులిచింతల ప్రాజెక్ట్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిచింతల ప్రాజెక్ట్ కాలనీకి చెందిన కొమ్ము లోకేశ్ (16) స్నేహితులతో కలిసి కృష్ణా నదిలో ఈత నేర్చుకోవడానికి వెళ్లాడు. నడుముకి ఖాళీ డబ్బా కట్టుకొని ఈతకు దిగాడు. ఈ క్రమంలోనే నడుముకి కట్టిన తాడు ఊడిపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు, మత్స్యకారులు గాలింపు చేపట్టగా కొంతసేపటి తర్వాత మృతదేహం లభ్యమైంది. లోకేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

మఠంపల్లి, మే 2: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో శుక్రవారం నిర్వహించిన విలేజ్ హెల్త్ శానిటేషన్(వీహెచ్‌ఎస్) కార్యక్రమం ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం కోడిగుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

నాగారం, మే 2: మండలంలోని డి.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు వేసవిలో వివిధ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకొచ్చారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ శిబిరంలో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులు బోధించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వాసం ప్రభాకర్ అన్నారు. సెలవులు ఉన్నప్పటికీ ప్రధానోపాధ్యాయురాలితో కలిసి ఉపాధ్యాయులంతా శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

## చెరువులో అస్తి పంజరం

చివ్వెంల, మే 2: మండల పరిధి బండమీది చందుపట్ల గ్రామంలోని ఊర చెరువులో అస్తి పంజరం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊర చెరువులో ఉపాధి హామీ కూలీలు శుక్రవారం పూడిక తీయడానికి వెళ్లగా అస్తి పంజరం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ మహేశ్వర్ చెరువు వద్దకు చేరుకొని పంచనామ నిర్వహించారు. అనంతరం సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ మనిషి పుర్రె, ఎముకలు మాత్రమే ఉన్నాయని.. అస్తి పంజరం మగా లేక ఆడా వారిదా అనే ఆనవాళ్లు లేవని వెల్లడించారు. అక్కడ లభ్యమైన వస్తువుల ప్రకారం ఆడ మనిషిలా ఉందని, పరీక్ష నిమిత్తం ఫోరెన్సిక్‌కు పంపించనున్నట్లు చెప్పారు. చెరువుకు పెద్ద ఎత్తున వరద ప్రవాహం ఉండే నేపథ్యంలో ఎక్కడి నుంచైనా కొట్టుకొని వచ్చి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్నందున ఎవరైనా హత్య చేసి చెరువులో వేసి ఉంటారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో మిస్సింగ్ కేసులు ఉన్నవారు చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## 'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

నూతనకల్, మే 2: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ విమర్శించారు. మండల కేంద్రం నూతనకల్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఐ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిందని, ఇప్పుడు వాటిని అమలు చేయలేక చేతులెత్తేసిందని అన్నారు. నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు, ఉద్యమకారులకు ఇంటి స్థలం తదితర హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని విమర్శించారు. సమావేశంలో సైదులు, వీరమల్లు, నాగన్న, అవిలయ్య, సూరయ్య నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు 6న లక్కీడ్రా

హుజూర్‌నగర్, మే 2: హుజూర్‌నగర్‌లోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాల కోసం ఈ నెల 6వ తేదీన ఉదయం 9 గంటలకు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా తీయనున్నట్లు ప్రిన్సిపాల్ రెహానా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని సూచించారు.

## 'కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి'

మేళ్లచెరువు, మే 2: అసంఘటిత రంగ కార్మికులకు శ్రమకు తగిన విధంగా కనీస వేతనాలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు డిమాండ్ పాలకులను చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య మానవుడు జీవించే పరిస్థితి లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సైదులు, అశోక్, జాని పాల్గొన్నారు.

## సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు ఎన్నిక

నేరేడుచర్ల, మే 2: సీపీఐ నేరేడుచర్ల పట్టణ, మండల కార్యదర్శులుగా కత్తి శ్రీనివాస్‌రెడ్డి, యల్లబోయిన సింహాద్రిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు తెలిపారు. నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఎన్నుకోబడిన సీపీఐ మండల, పట్టణ కమిటీ బాధ్యులు ప్రజలను సమీకరించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

పెన్‌పహాడ్, మే 2: పెన్‌పహాడ్‌లో గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ ఒక వ్యక్తి పట్టుబడినట్లు ఎస్‌ఐ కస్తాల గోపికృష్ణ తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని శుక్రవారం జిల్లా కోర్టులో హాజరు పర్చగా ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీరు వెలువరించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

## 'పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి'

ఆత్మకూర్.ఎస్, మే 2: మండలంలోని ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలో పాఠశాలకు చెందిన 37 మంది విద్యార్థులకు అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి మండలంలో 2వ స్థానంలో నిలిచారని వివరించారు. దాతల సహకారంతో ప్రతిరోజు విద్యార్థులకు స్నాక్స్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాసిత్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, రవి, నగేశ్, రమణ, పుష్పకుమారి, విజయ పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి 'భూ భారతి'

నాగారం, మే 2: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని తెలంగాణ సాంస్కృతిక సారథి టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. డి.కొత్తపల్లి గ్రామంలో భూ భారతి చట్టంపై సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాకారులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాడి శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, స్రవంతి, శిరీష పాల్గొన్నారు.

## పేదల పక్షాన సీపీఐ పోరాటం

- ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

గరిడేపల్లి, మే 2: పేదల పక్షాన నిరంతరం పోరాడేది సీపీఐ మాత్రమేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మండవ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, బందు రామయ్య, అంబటి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, దైదా ఏసుపాదం, కొమ్ము వెంకన్న, గోపిరెడ్డి, కీసరి నాగయ్య, నాగేశ్వరరావు, లింగరాజు, నబీ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం



మహేశ్‌బాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

నేరేడుచర్ల, మే 2: మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి యడవల్లి మహేశ్‌బాబుకు దాతల సహకారంతో రూ.34 వేల ఆర్థిక సాయం అందజేశారు. తల్లిదండ్రులు సైదులు, ప్రమీల కొంత కాలం క్రితం మృతిచెందడంతో మహేశ్‌బాబు అనాథగా మారాడు. మహేశ్‌బాబు స్థితిగతులను గ్రామానికి చెందిన జీడిమెట్ల రవి, భార్గవ్ సైదులు అనే వ్యక్తులు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. దీంతో అతడి చదువు నిమిత్తం దాతల సహకారంతో రూ.34 వేలు సేకరించి శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. కాగా, మిర్యాలగూడలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లో చదువుతున్న మహేశ్‌బాబు ఇటీవల వెల్లడైన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో 470 మార్కులకు గానూ 447 సాధించి ప్రతిభ కనబరిచాడు. కార్యక్రమంలో నందమూరి బాబురావు, వల్లంశెట్ల మట్టపల్లిరావు, ఇంజమూరి వెంకటయ్య, సిద్ధపంగ సైదులు, పెండెం హరిబాబు, అల్వాల శ్రీధర్, సిద్ధపంగా సైదులు, కోడి పవన్, వెంకటనర్సు, ఏసు, రాహుల్, భుజంగరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల వైద్యాధికారి నరేశ్



కట్టవారిగూడెంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి నరేశ్

గరిడేపల్లి, మే 2: ప్రజలు వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి నరేశ్ సూచించారు. మండల పరిధిలోని కట్టవారిగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎండలో ఎక్కువగా తిరగకూడదని తెలిపారు. ప్రజలు ఏవైనా పనులు ఉంటే ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత చూసుకోవడం మంచిదని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఎండలో బయటకు వెళ్లకూడదని పేర్కొన్నారు. మజ్జిగ, ఓఆర్‌ఎస్, కొబ్బరినీళ్లు, నిమ్మకాయ రసం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.అంజయ్యగౌడ్, ఎల్‌టీ ఉపేందర్, కవిత, అరుణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థినులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, మే 2: పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేరేడుచర్లలో శుక్రవారం ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. దిర్శించర్ల జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థిని దామరచర్ల ప్రణవి 564 మార్కులతో మండల ప్రథమ స్థానం, చిల్లేపల్లి గురుకుల పాఠశాలకు చెందిన కామల్ల చందు ప్రియ, నిమషకవి కీర్తన 563 మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ముగ్గురికి కలిపి రూ.14 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనుకరణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, చార్టర్ ప్రెసిడెంట్ కొణతం సీతారాంరెడ్డి, కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి యూసుఫ్, అంజయ్య, పూర్ణచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, విశ్వనాథం, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన'



నేరేడుచర్లలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల, మే 2: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధనతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని నేరేడుచర్ల జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలోని పలు వార్డుల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలతో కూడిన కరపత్రాలను ముద్రించి ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టా శ్రీనివాస్‌రెడ్డి, రావిరాల శౌరి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సిబ్బందికి సెలవులు ప్రకటించడంపై హర్షం

సూర్యాపేట టౌన్, మే 2: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఈ నెల 1 నుంచి జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులు ఇవ్వడంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి సెక్టార్ ప్రాంతంలో శుక్రవారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంపటి గురూజీ, ఏరియా ఆసుపత్రి సెక్టార్ అధ్యక్షురాలు జి.శారద, కార్యదర్శి దార జ్యోతి, కలకోట జ్యోతి, కారింగుల సావిత్రి, వీరమ్మ, సునీత, భాగ్యలక్ష్మి, రిజ్వాన పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలో అన్నప్రాసన

నూతనకల్: మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజులత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నట్లయితే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.